జగనన్న కాలనీకి చంద్రగ్రహణం

- కొరవడిన మౌలిక వసతులు..
- మంచినీటికి సైతం తప్పని ఇక్కట్లు
- గృహాలను ఖాళీచేసి పేటకు తరలుతున్న జనం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట సమీపంలోని బలుసుపాడు రోడ్డులో ఉన్న జగనన్నకాలనీకి తగిన మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వహయాంలో బలుసుపాడులో లేఅవుట్‌లో ఎల్‌పీ–1లో 140 మందికి, ఎల్‌పీ–2లో 540 మందికి ఇళ్లస్థలాలు ఇచ్చారు. ప్రభుత్వం విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేసింది. ఇక్కడ అర్బన్‌హెల్త్ సెంటర్‌ను నిర్మించింది. దీంతో గత ప్రభుత్వ ఆర్థికసాయంతో ఎల్‌పీ–1లో 30మంది, ఎల్‌పీ–2లో 300మంది పేదలు పక్కాగృహాలు నిర్మించుకుని సొంతింటికలను నెరవేర్చుకున్నారు.



పేట బలుసుపాడు రోడ్‌లోని జగనన్న కాలనీ

శాపంగా మారిన ప్రభుత్వ మార్పిడి..

జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలికవసతులు కల్పించే సమయానికి రాష్ట్రంలో ఎన్నికలు రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి. ఎన్నికల అనంతరం ఏర్పడిన సీఎం చంద్రబాబు నేతృతంలోని కూటమి ప్రభుత్వం ఈ కాలనీలో మౌలికవసతులు కల్పనకు గత ఎనిమిది నెలలుగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో కాలనీలో కనీస మౌలికవసతులు కరువై పేదలు ఇబ్బందులుపడుతున్నారు. దీంతో ఇక్కడ ఇళ్లు నిర్మించుకుని పేదలు అవస్థలుపడుతున్నారు. కూటమి ప్రభుత్వానికి ఈ జగనన్న కాలనీల పేర్లను ఎన్టీఆర్ కాలనీలుగా మార్పు చేస్తూ జీవో జారీచేయడంపై ఉన్న శ్రద్ధ, ఈ ఎనిమిదినెలల కాలంలో ఆకాలనీల్లో మౌలికవసతులు కల్పించడంలో లేకపోవడం గమనార్హం.

మంచినీటికి సైతం కటకట..

కాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 8నెలలు అవుతున్నప్పటికీ జగనన్న కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించలేదు. రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతోపాటు వీధిదీపాలు సైతం వెలగకపోతుండటంతో జగనన్న కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పాలేటి నుంచి నీటి కోసం పైపులైన్ ఏర్పాటుచేసినప్పటికి ఇటీవల వచ్చిన వరదలకు మోటారు కొట్టుకుపోయింది. దీంతో వాడుకోవడానికి కూడా నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, కాలనీలోని సమస్యలను పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోకి రేషన్ సరుకులు ఇచ్చే వాహనం రాకపోతుండటంతో కాలనీవాసులు జగ్గయ్యపేట పట్టణానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. పింఛన్ కోసం ప్రతినెలా జగ్గయ్యపేటకు ఆటోలో వెళ్లాలంటే రూ.200 ఖర్చవుతోందని కాలనీలోని లబ్ధిదారులు వాపోతున్నారు.



గృహాల మధ్య పెరిగిన కంపచెట్లు



అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్లు

నిలిచిన ఇళ్లపనులు..

జగనన్న కాలనీకి మౌలికవసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అనేక పక్కాగృహాల నిర్మాణాల పనులు నిలిచిపోయాయి. వసతులు లేకపోతే ఇక్కడ ఎలా ఉండగలమని ఆందోళన లబ్ధిదారులను వేధిస్తోంది. పక్కాగృహాల నిర్మాణపు పనులకు అవసరమైన నీరు కూడా అందుబాటులో లేకపోవడంతో ఆయా పనులు నిలిచిపోయాయి. ఇక ఇల్లు నిర్మించుకోని ఆయా ఖాళీస్థలాలు, సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోవటంతో కాలనీవాసులు భయాందోళనలు చెందుతున్నారు. పాములు, క్రిమికీటకాల కారణంగా రాత్రివేళల్లో భయంభయంగానే కాలంగడుపుతున్నారు. ఎప్పుడు ఎవరికి ఏప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోందని కాలనీవాసులు చెబుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



ఎన్నికలు అయిపోయినప్పటి నుంచి మాకాలనీ గురించి అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. కాలనీలో గృహాల మధ్య కంపచెట్లు పెరిగి పరిసరాలు అడవిని తలపిస్తున్నాయి. కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు, అంగన్‌వాడీ సెంటర్ వంటి మౌలికవసతులు కల్పించాలి.

– బి.అనూష, కాలనీవాసి

మంచినీరు లేక అల్లాడుతున్నాం..



కాలనీలో నీటిసౌకర్యం లేక అవస్థలుపడుతున్నాం. వాడుక నీటికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. కాలనీలో బోరు పంపులు ఏర్పాటు చేసి ఉన్న ట్యాంకులకు కనెక్షన్ ఇస్తే కొంతవరకు సమస్య తీరుతుంది. మా సమస్యలను అధికారులు పరిష్కరించాలి.

– మార్కపూడి బాబు, కాలనీవాసి...

నీటిసౌకర్యం కల్పిస్తాం..



జగనన్న కాలనీకి తాత్కాలిక ప్రాతిపదికన రోజుకు రెండుసార్లు మున్సిపల్ ట్యాంకర్‌ను పంపి నీటిని సరఫరా చేస్తున్నాం. కాలనీవాసుల అవసరాల రీత్యా ఇంకో ట్యాంకర్ నీటిని సరఫరా చేస్తాం. త్వరలో టిడ్కో ఇళ్లతోపాటు ఈఎస్ఎల్ఆర్ ట్యాంకు ఏర్పాటు చేసి కాలనీలోని ఇంటింటికీ కుళాయి సౌకర్యం కల్పిస్తాం.

– ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్

ప్రతిభచూపిన పేట విద్యార్థులు



జగ్గయ్యపేటఅర్బన్: ఈనెల 21 నుంచి 25వతేదీ వరకు పాండిచ్చేరిలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో జగ్గయ్యపేటకు చెందిన జేవీజే జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచారు. గైడ్ టీచర్ జి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఎం.నాగతేజ, వై.భార్గవధనుష్‌లు, తయారుచేసిన ప్రొటెక్టింగ్ వెహికిల్స్ అండ్ బ్రిడ్జెస్ ఫ్రమ్ ఫ్లడ్స్ అనే ప్రాజెక్టు గ్రూప్ కేటగిరీలో తృతీయ స్థానంలో నిలిచింది. దీంతో పాండిచ్చేరి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, అసెంబ్లీ స్పీకర్ చేతుల మీదుగా విద్యార్థులకు మెమొంటో, ప్రశంసా పత్రాన్ని అందజేసినట్లు పేట బాలుర హైస్కూల్ హెచ్‌ఎం. ఎ.మాధవీలత శనివారం తెలిపారు. జాతీయ స్థాయిలో తృతీయ బహుమతి గెలుచుకున్న విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

వెండి తాపడం తయారీకి రూ.25వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయంలో అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి శనివారం ఖమ్మం పట్టణానికి చెందిన గుడిపూడి హరీష్ రజని రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఈ రమ చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ ఓటరు నమోదు అధికారిగా ఆర్డీవో బాలకృష్ణ



నందిగామటౌన్: ఉత్తమ ఓటరు నమోదు అధికారిగా నందిగామ ఆర్డీవో బాలకృష్ణ అవార్డు అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఓటరు నమోదు అధికారిగా అవార్డు అందుకున్న ఆర్డీవో బాలకృష్ణకు రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఉరుసు ఉత్సవం



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామంలోని మస్తాన్‌వలి దర్గాలో శుక్రవారం రాత్రి ఉరుసు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ముస్లిం మతపెద్దలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని నమాజ్ చేశారు. తన్నీరు మాట్లాడుతూ కులమతాలకతీతంగా ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామనాయకులు కుమార్, నాగరాజు, నాగుల్ మీరా, దాదాసాహెబ్, సైదావలి పాల్గొన్నారు.

పురోహిత సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కిరణ్



కంచికచర్ల :రాష్ట్ర బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కంచికచర్లకు చెందిన మొలుగు కిరణ్‌కుమార్ ఆచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూర్యశర్మ కిరణ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తానని, వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.

అఖండ దీప పూజలు



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో భక్తులు శుక్రవారం రాత్రి అఖండ దీపోత్సవ పూజలు చేశారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పొంగళ్లు తయారు చేసి అఖండ దీపాలను వెలిగించి చక్కభజనలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు గరుడ సేవ, పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదాంతం శేషాచార్యులు, శ్రీధరాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ద్విచక్రవాహనచోదకులతో ప్రతిజ్ఞ



పెనుగంచిప్రోలు: ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలని ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ సూచించారు. పెనుగంచిప్రోలులో శనివారం ఆయన హెల్మెట్ వినియోగంతో కలిగే లాభాలపై ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. తప్పకుండా హెల్మెట్ వినియోగిస్తామంటూ వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు.

చిల్లకల్లులో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకుంటే అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ హెచ్చరించారు. గ్రామంలోని ప్రధాన సెంటరులో హెల్మెట్ వినియోగంపై శనివారం ఆయన ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని సూచించారు. ఏఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణాభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రికి ఎమ్మెల్యే తాతయ్య వినతి

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), రాష్ట్రమున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కోరారు. మంత్రి నారాయణను ఆయన శనివారం విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు నెలల క్రితం వచ్చిన వరదల కారణంగా రోడ్లు, డ్రెయిన్లు, పైపులైన్లు దెబ్బతినడంతో సుమారు రూ 14కోట్లు నష్టం వాటిల్లినందున ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. 50 ఏళ్ల కిందటి పైపులైన్ల వ్యవస్థను పూర్తిగా మార్చాల్సి ఉన్నందున పైపులైన్ల పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని, 75 శాతం పనులు పూర్తయిన 3,160 టిడ్కో ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసేందుకు నిధులు మంజరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. రెండు మూడు రోజుల్లో అవగాహన నిమిత్తం అధికారులను పంపి కావాల్సిన నిధులపై ప్రణాళిక తయారుచేసి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్ సైదేశ్వరరావు, నాయకులు వేదులాపూరి సైదా, నకిరికంటి వెంకట్, దువ్వల రామకృష్ణ, బీజేపీ నాయకులు నోముల రఘు ఉన్నారు.



మంత్రి నారాయణను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

తాళం వేసిన ఇంట్లో చోరీ



లింగగూడెం(పెనుగంచిప్రోలు): తాళం వేసిన ఇంట్లో నగదు చోరీ అయిన ఘటన మండలంలోని లింగగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొట్టిపాల చిన్న వీరయ్య ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల గ్రామానికి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాగా బీరువా లాకర్ ఓపెన్ చేసి ఉండటాన్ని గమనించారు. బీరువాలోని రూ.1,48,000 గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని గుర్తించారు. వీరయ్య భార్య అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్ సభ్యులు శనివారం లింగగూడెంలోని బాధితుడి ఇంటిని పరిశీలించారు.

అమ్రితసాయి విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

పరిటాల(కంచికచర్ల): పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. చెన్నైకు చెందిన సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధులు ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు మౌఖిక పరీక్ష, రాతపరీక్ష నిర్వహించారు. గ్రూప్ డిస్కషన్‌తోపాటు హెచ్‌ఆర్ ప్రతినిధులు ఇంటర్వ్యూ చేశారు. ఆయా పరీక్షలు, ఇంటర్వ్యూల్లో ప్రతిభచూపిన 33మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ శనివారం తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనంగా రూ.3.20లక్షలు అందజేస్తారన్నారు. ఈ మేరకు ఆసంస్థ ప్రతినిధులు నియామకపత్రాలు అందజేశారని వివరించారు. తమ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యనందించటంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ తోపాటు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ పి.చిరంజీవి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అమ్రిత సాయి యాజమాన్యం

ఈ విజయస్తూపాలు కొణకంచికే సొంతం

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో పశ్చిమకృష్ణాలో పెనుగంచిప్రోలు మండలంలోని కొణకంచి గ్రామానికి ప్రత్యేక స్థానం ఉంది. గ్రామం కేంద్రంగా జాతీయోద్యమాన్ని నాటి నేతలు ఉధృతంగా సాగించారు. అందుకు గుర్తుగా స్వాతంత్ర్య సాధన అనంతరం 1948లో గ్రామ నడిబొడ్డున 46 అడుగుల విజయస్తూపం, 1950లో రిపబ్లిక్ డే చిహ్నంగా 18 అడుగుల స్తూపాన్ని నిర్మించారు. ఈ విజయస్తూపాలు నాటి స్వాతంత్ర్యోద్యమ, గణతంత్ర దినోత్సవ స్ఫూర్తికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచాయని గ్రామస్తులు చెబుతున్నారు.



అడుగుల స్వాతంత్ర్యోద్యమ విజయస్తూపం



18 అడుగుల రిపబ్లిక్ దే స్థూపం

పీఏసీఎస్ పనితీరుకు ప్రశంసలు



పెనుగంచిప్రోలు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్రానికి చెందిన సహకార సంఘ అధికారులు శనివారం సందర్శించారు. రంగారెడ్డి జిల్లా సహకార బ్యాంక్ సీఈఓ సుబ్రమణ్యం, జీఎం ప్రభాకరరెడ్డి, బీజీఎం నాగఅంజలి, ఏజీఎం శ్రీనివాస్‌లతో కూడిన బృందం సంఘ పనితీరును పరిశీలించి అభినందించారు. కర్షకమిత్ర, రైతునేస్తం రుణాల మంజూరు, రికవరీ వివరాలను అడిగితెలుసుకున్నారు. సంఘం తరుపున నిర్వహిస్తున్న పెట్రోల్‌బంక్‌ను కూడా సందర్శించి సంఘం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న ప్రణాళికలపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఆర్.రజనీకాంత్, సూపర్ వైజర్ బాలాజీ, సంఘ సీఈఓ ఎస్ కొండలుశర్మ, అకౌంటెంట్ ఆర్.సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

నందిగామటౌన్: సీతారామ నామ సంకీర్తన సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా దుడ్డు నాగేశ్వరరావు, ఉటుకూరు వెంకట సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు అనుగుణంగా 72వ శ్రీరామకోటి మహోత్సవాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పారేపల్లి సాయిబాబు, కొత్తా ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం



పెనుగంచిప్రోలులో సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న తహసీల్దార్ శాంతిలక్ష్మి తదితరులు



అడవిరావులపాడులో సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ఎంపీపీ హనుమంతరావు తదితరులు



గండేపల్లిలో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సర్పంచి రవికుమార్ తదితరులు



పేటలో ఓటర్ల అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఈఆర్‌వో మహేశ్వరరావు, అధికారులు



గండ్రాయిలో సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



వత్సవాయి: బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం అశోక్‌కుమార్ తదితరులు

పెనుగంచిప్రోలు:ప్రజాస్వామ్య దేశంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉందని తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌తోపాటు గ్రామాల్లో ఓటు ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీ పాఠశాలలో సీనియర్ ఓటర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. తొలుత ఓటరు ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. చక్కటి పనితీరును కనబరిచిన వీఆర్వో, వీఆర్‌ఓ, బీఎల్‌ఓలకు తహసీల్దార్ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో డి.రవీంద్ర, ఏవో సిద్ధారెడ్డి, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కొణకంచి గ్రంథాలయంలో గ్రామస్తులచే గ్రంథాలయాధికారి రామచంద్రుడు ప్రతిజ్ఞ చేయించారు.

మాక్ పార్లమెంట్ నిర్వహణ..

వత్సవాయి: మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వత్సవాయిలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులచే మాక్ పార్లమెంట్ నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులను అందించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. తహశీల్దార్ ప్రభుకుమార్, జెడ్పీ హెచ్‌ఎం అశోక్‌కుమార్, వీఆర్వో శ్రీను పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

గండ్రాయి(జగ్గయ్యపేట): గండ్రాయి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు గ్రామంలోని సీనియర్ సిటిజన్లు కమ్మరి భద్రయ్య, పిల్లి పెద్ద వెంకయ్య, షేక్ సత్తాబిలను ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం నేలవెల్లి రమేష్ బాబు, సచివాలయ కార్యదర్శి రమాదేవి, టీచర్లు సుబ్బారావు, దేవదానం, పద్మావతమ్మ, కృష్ణంరాజు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల:మండలంలోని ఎస్.అమరవరం, కంచికచర్లతోపాటు పలు గ్రామాల్లో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి కోదాటి సీతారాం, మాజీ సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, వీఆర్వో, కార్యదర్శి పాల్గొన్నారు. గండేపల్లి, గనిఆత్కూరు, చెవిటికల్లు, కొత్తపేట, మున్నలూరు, మోగులూరు, పరిటాల తదితర గ్రామాల్లో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచులు బొక్కా రవికుమార్, బుడ్డి విజయలక్ష్మి, ప్రత్తిపాటి సునీత, కొంగర మురళి, యద్దనపూడి ఆనందజ్యోత్స్న పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్: మండలంలోని అడవిరావులపాడు ప్రభుత్వ పాఠశాలలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ ఆకుల హనుమంతరావు మాట్లాడుతూ ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని పేర్కొన్నారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరా వెంకట నర్సమ్మ, గ్రామ నాయకులు సూరా కొండ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని చందాపురం, తొర్రగుడిపాడు, కొండూరు, జొన్నలగడ్డ, ఐతవరంతోపాటు ఆయా గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. నందిగామ పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీనియర్‌సిటిజన్లను సత్కరించారు. ఆయా గ్రామాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని పేట అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో ఓటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. ఎలక్షన్ డీటీ ఎల్.రాధిక, ఆర్‌ఐ సూర్యకుమారి, ఎస్‌ఏ యు.ఆనంద్‌బాబు, హెచ్‌ఎం.మాధవీలత, బీఎల్‌ఓలు, సచివాలయ సెక్రటరీలు, పలు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ సిటిజన్ జ్ఞానరత్నంను సన్మానించారు. స్కూల్ హెచ్‌ఎం ఎ.లక్ష్మి, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.